## అవుశాపూర్‌లో సమస్యలపై ఎంపీపీ ఆరా

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ వై.సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్‌లో మంగళవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎంపీపీ, గ్రామ సర్పంచ్ కావేరితో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగితెలుసుకున్నారు. పలుచోట్ల నెలకొన్న డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణం కొరకు గ్రామస్తులు ఎంపీపీ దృష్టికి తెచ్చారు. ఎంపీవో నందకిషోర్, ఏఈ. శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సునీత, నాయకులు వై.మశ్చేందర్‌రెడ్డి, కంచర్ల వెంకట్‌రెడ్డి, సాయిలు, బాలకృష్ణ పాల్గొన్నారు.



అవుశాపూర్‌లో సర్పంచ్‌తో కలిసి పర్యటించి సమస్యలు అడిగితెలుసుకుంటున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి తదితరులు

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఉరివేసుకుని బుల్కాపూర్ వాసి మృతి

**శంకర్‌పల్లి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** బుల్కాపురం గ్రామానికి చెందిన మల్కారం శంకరయ్య (38) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 11న శంకర్‌పల్లిలో ఉరివేసుకున్నాడు. అతనిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శంకరయ్యకు తొలుత లలిత అనే మహిళతో వివాహం జరిగి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆ తర్వాత కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య, భర్తలు ఇద్దరు విడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో లక్ష్మి అనే మరో మహిళతో శంకరయ్య వివాహం చేసుకున్నాడు. లక్ష్మితో వివాహం జరిగిన నాటి నుంచి మంచిగా ఉంటున్న అతను ఏడాది కిందట వరుసకు చిన్నమ్మ అయిన సక్కుబాయితో సహజీవనం చేస్తున్నాడు. ఈ విషయం తన భార్య లక్ష్మికి తెలిసి గత 15 రోజుల కిందట పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి అతన్ని మందలించగా ఆ విషయంలో తీవ్ర మనస్థాపం చెందిన శంకరయ్య ఈ నెల 11న సక్కుబాయి వాళ్ల ఇంటికి వెళ్లి రాత్రి ఏడు గంటల సమయంలో ఉరి వేసుకున్నాడు. సంగారెడ్డి ఆసుపత్రికి తరలించే లోపుగానే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హాజరు రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న దామోదర్

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

### డిప్యూటి డీఎంహెచ్‌వో దామోదర్

**షాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త :** రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటి డీఎంహెచ్‌వో దామోదర్ అన్నారు. మంగళవారం చందన్‌వెల్లి, షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టార్‌ను పరిశీలించారు. చందన్‌వెల్లిలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే ఏ విధంగా రక్షణ చర్యలు తీసుకోవాలో, అగ్నిమాపక పరికరాన్ని ఏవిధంగా వాడాల్లో అగ్నిమాపక సిబ్బంది తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విధుల పట్ల వైద్యులు, సిబ్బంది బాధ్యతగా మెలగాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. డాక్టర్లు వరలక్ష్మి, శ్రీనివాస్, సిబ్బంది నవీన్, గోపాల్ ఉన్నారు.

## ఉచిత బస్సు సౌకర్యం శుభపరిమణం



బస్సును ప్రారంభిస్తున్న ఎంపీటీసీ పొన్న జయమ్మవెంకట్‌రెడ్డి

**షాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త :** మహిళలు మహాలక్ష్మిని సద్వినియోగం చేసుకోవాలని హైతాబాద్ ఎంపీటీసీ పొన్న జయమ్మవెంట్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటిల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించడంతో మంగళవారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడకు బస్సును ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం శుభపరిమణమన్నారు.మద్దూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వడ్ల సతీష్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కు అభినందనలు



రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కు అభినందనలు తెలిపిన గెజిటెడ్ ఆఫీసర్స్ రెండు రాష్ట్రాల యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ డి.భీమ్ రాజ్

**మొయినాబాద్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌ను రెండు రాష్ట్రాల గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ డి.భీమ్ రాజ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భీమ్ రాజ్ మాట్లాడుతూ దేశంలో రాజకీయ వ్యవస్థ అంతా రాజ్యాంగాన్ని అనుసరించి లిఖించి నడవబడుతుందని చెబుతూ రాజ్యాంగ ప్రతిని గడ్డం ప్రసాద్‌కు బహుకరించారు. నిరుపేదల పక్షాన పోరాడే ప్రజా గొంతుక గడ్డం ప్రసాద్ అని అన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేసే మంచి మనస్సు ఉన్న వ్యక్తి అని కొనియాడారు. శాసనసభ స్పీకర్‌గా ఆయన బాధ్యతలు త్వరలో స్వీకరించనుండడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఇరు పక్షాలకు సరైన సమయం కేటాయించి ప్రజా సమస్యలపై చర్చించే అవకాశం కల్పించే నిస్వార్థమైన మనస్సు ఉన్న మారాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సురేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

## యువతను క్రీడల్లో ప్రోత్సాహించాలి: సంగీత

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** యువకులు క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు వస్తుందని ఘట్‌కేసర్ మున్సిపల్ 3 వార్డుకౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎన్‌ఎఫ్‌సీనగర్‌లోని విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు క్రికెట్ ఆడేందుకు వీలుగా కౌన్సిలర్ రూ.25 వేల విలువైన రెండు క్రికెట్ కిట్లను వారిని అందజేశారు. యువకులు సెల్‌పోన్ల వినియోగం తగ్గించి క్రీడలపై ఆసక్తి చూపాలని, తగిన ప్రోత్సాహం అందిస్తామని కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెడబొయిన వెంకటేశ్, మాజీ ఎంపిటిసి జంపాల రమేశ్, మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, విబి.వెంకట్‌నారాయణ, బొక్క జంగారెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, మల్లేశ్, నర్సింహ్మారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వినయ్, సాయిరాం, డిజి.నాయక్ తదితరులు పాల్గొన్నారు.



యువకులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ సంగీతా ప్రభాకర్‌రెడ్డి

# ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌పై ఢిల్లీ హైకమాండ్ ఫోకస్

## త్వరలో పార్టీ అధ్యక్షుల మార్పుకు సమాలోచన

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్ 12(ప్రభాతవార్త) :** నగర శివారు ప్రాంతాలు అయిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అనుకున్ని స్థానాలను కైవసం చేసుకోకపోవడానికి ప్రదాన కారణం నాయకుల సమన్వయం లేకపోవడంతోనే పార్టీ తగినన్ని శాసన సభ స్థానాలను సాధించలేకపోయిందని ముమ్మరంగా ప్రచారం కొనసాగుతుంది. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్ మినహా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో తగినన్ని శాసన సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలవకపోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. వికారాబాద్ జిల్లాలో వికారాబాద్, పరిగి, తాండూర్, కోడంగల్ నాలుగు స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహింపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి స్థానాలలో మాత్రమే కాంగ్రెస్ గెలవగా మిగితా స్థానాలైన ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఐదు స్థానాల్లో ఓటమిని చవిచూసింది. ఇక మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఓటమి పాలైంది. దీంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై కేంద్రంలోని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకుల పనితీరుపై ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం. ఈ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి వ్యూహ్యంతో ముందుకు సాగాలనే దానిపై సమాలోచనలు నిర్వహిస్తున్నట్లు తెలిసిందే. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి గల కారణం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులతో సమీక్షించినట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికతో పాటు ప్రచారంలో కొనసాగిన పనితీరు తదితర అంశాలపై చర్చించినట్లు ప్రచారం. తెలంగాణ వ్యాప్తంగా అత్యదిక స్థానాలు గెలిచిన మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం,వరంగల్ జిల్లాలకు ధీటుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కూడా ఫలితాలు ఉంటాయని ఆశించిన కేంద్రం, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిశీలకులకు జిల్లాలోని ఫలితాలు ఆశాజనకంగా లేకపోవడంతో వారు జిల్లాలో మునుముందు కాంగ్రెస్ పార్టీని గాడిలో పెట్టి నడిపించడానికి తీసుకోవాల్సిన చర్యలు పార్టీలో,సీనియర్ నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడానికి ఢిల్లీ పెద్దలు ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా ఫలితాలపై కొంత నిరూత్సహానికి గురైన త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల వరకు ఈ రెండు జిల్లాలో బలమైన నాయకత్వానికి త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లాలోని జిల్లా పార్టీల అధ్యక్షుల పనితీరు, పార్టీలో ఉన్న ఇతర పాలకవర్గాన్ని కూడా సమూలంగా మార్చడానికి ఢిల్లీ హైకమాండ్ రాష్ట్ర నాయకత్వానికి సూచనలు చేసినట్లు సమాచారం, పార్టీని అనుకున్నస్థాయిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల దృష్టికి తీసుకువెళ్లడంలో పూర్తిగా విఫలం చెందిందనే విమర్శలు ఢిల్లీ హైకమాండ్ దృష్టికి వచ్చినట్లు,త్వరలో జిల్లా పార్టీల అధ్యక్షులను సైతం మార్చి కొత్త వారికి బాధ్యతలు అప్పగించి పార్టీని బలోపేతం చేయడానికి కృషిచేస్తున్నట్లు తెలిసింది.



## శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

### డీసీపీ నారాయణరెడ్డి ఐపీఎస్



పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ నారాయణరెడ్డి ఐపీఎస్

**ఆమనగల్లు, డిసెంబర్12, ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా పోలీసుశాఖ విధులు నిర్వర్తిస్తుందని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఐపీఎస్ అన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి పోలీస్‌శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని, ప్రజలు పోలీసులకు సంపూర్ణంగా సహకరించాలని ఆయన సూచించారు. మంగళవారం ఆమనగల్లు పోలీస్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై బల్‌రాంనాయక్‌లతో కలిసి వివిధ అంశాలపై చర్చించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు, క్రైమ్ రేట్ తీరును తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన నూతన సీసీ కెమెరాల పర్యవేక్షణ కేంద్రాన్ని డీసీపీ ప్రారంభించారు. అనంతరం కెమెరాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈమేరకు జరిగిన విలేకరుల సమావేశంలో డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారి 765పై ఎదురౌతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ రేట్ చాలా తక్కువగా ఉన్నదని గుర్తించి సిబ్బందిని ఆయన అభినందించారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా మెలగాలన్నారు. ప్రజాకాంక్షకనుగుణంగా నడుచుకోవాలన్నారు. అంతకు ముందు డీసీపీ నారాయణరెడ్డికి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బంది గౌరవవందనం సమర్పించారు.

# బదిలీ కాదు.. ఇంటికే పంపిస్తా !

**వివరాలు ఇవ్వని అధికారులకు ఎమ్మెల్యే హెచ్చరిక**
**నీళ్లు నమిలిన మున్సిపల్ అధికారులు**
**వివిధ శాఖలపై సమీక్షించిన మనోహర్‌రెడ్డి**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** చూడ్డానికి స్మార్ట్‌గా ఉన్నా పాలనలో మంచి పట్టు ఉన్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వివిధ శాఖల అధికారుల వైఫల్యాలపై గరం గరం అయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా, నిధులు సద్వినియోగం చేయకుండా కాలయాపన చేసే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఇవ్వకుండా దాటవేత ధోరణి ప్రదర్శించిన మున్సిపల్ అధికారులను బదిలీ కాదు.. ఇంటికే పంపిస్తామని హెచ్చరించారు. దాంతో కమిషనర్, అధికారులు నీళ్ల నమలాల్సి వచ్చింది. సోమ, మంగళ వారాల్లో తన నివాసంలో వివిధశాఖల అధికారులతో ఎమ్మెల్యే తొలి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. విశ్వసనీయవర్గాలు తెలిపిన వివరాల ప్రకారం సమీక్షలు హాట్‌హాట్‌గా సాగాయి. గత కొన్నేళ్లుగా పాలనను గాలి కొదిలేసిన వివిధ శాఖల అధికారులను ఊహించని రీతిలో ఎమ్మెల్యే ఉక్కిరిబిక్కిరి చేశారు. తాండూరు మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న రూ.32 కోట్ల పనుల గురించి కమిషనర్‌ను ప్రశ్నించారు. వివరాలు తన వద్ద లేవని ఇంజనీరింగ్ అధికారుల వైపు చూశారు. లోగడ ఏజెండాలో పొందుపరిచిన నిధుల వివరాలపై అస్పష్టమైన సమాధానాలు ఇచ్చారు. శానిటేషన్‌లో పాత ఫాగింగ్ మిషన్లు ఉండగానే కొత్త మిషన్లు కొనుగోలుపై ఎమ్మెల్యే ఆరా తీయగా అందుకూ దాటవేత ధోరణి ప్రదర్శించారు. దాంతో ఆగ్రహం చెందిన ఎమ్మెల్యే పైవిధంగా స్పందించారు. సరిగ్గా పని చేయకుండా బదిలీ చేసి చేతులు దులుపుకొంటామని భావించవద్దని, ఏకంగా ఇంటికే పంపిస్తామని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడంతో అంతా అప్రమత్తమైనారు. తాండూరు మున్సిపాలిటీలో ఇంజనీరింగ్, శానిటేషన్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు కౌన్సిలర్లు ముందుగానే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. దాంతో అన్ని విభాగాలపై లోతైన సమీక్ష జరుపడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సోమవారం నిర్వహించిన సమీక్షకు వివిధశాఖల ఇంజనీరింగ్ అధికారులు కేవలం తమ వర్క్‌ఇన్‌స్పెక్టర్లను పంపించడంతో వారిని వెనక్కు పంపించారు. డీఈ స్థాయి అధికారుల నుంచి జేఈ, ఎఈలు సమగ్ర వివరాలు సమీక్షకు రావాలని ఎమ్మెల్యే సూచించారు. మంగళ వారం ఆర్‌అండ్‌బి డీఈ, జేఈ, పంచాయత్‌రాజ్, ఇరిగేషన్ డిఈలు, జూనియర్, సహాయ ఇంజనీర్లు హాజరైనారు. ఆర్‌అండ్‌బీలో సుమారు 200 కోట్ల రూపాయల పనులు పెండింగ్‌లో ఉన్నట్లు ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది.

### బాలారిష్టాల్లో బైపాస్

బైపాస్ పూర్తయిందని లోగడ ప్రచారం జరిగినా వాస్తవానికి 50 శాతం కూడా పూర్తి కాలేదని స్వయంగా ఆర్‌అండ్‌బీ అధికారులు అంగీకరించారు. కొడంగల్ రోడ్డు నుంచి కొకట్ రోడ్డు వరకు ఇంకా పనులు కాలేదు. మార్గమధ్యలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జీ నిర్మించాల్సి ఉంది. ఇప్పట్లో ఆ పనులు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. 100 కోట్ల రూపాయల విలువైన బైపాస్ రోడ్డుకు ఏడేండ్ల క్రితం శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ రోడ్డు నుంచి కొకట్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జీ వరకు కొంత వరకు పనులు చేసి వదిలేశారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నుంచి గౌతాపూర్ వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డుకు అనేక ఆటంకాలు వస్తున్నాయి. మార్గమధ్యలో ఇంకా భూసేకరణకు నష్టపరిహారం ఇవ్వనందున రైతులు పనులు నిలిపివేశారు. ఈ అంశంపై రెవెన్యూ పరిధిలో ఉందని డీఈఈ శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. దీనిపై ఆర్డీవోతో చర్చించి త్వరలో బైపాస్ పనులు వేగమంతం చేయిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులకు తెలిపారు. కాంట్రాక్టర్‌కు సరైన బిల్లులు చెల్లింపులు కూడా జరగడం లేదని సమీక్షలో చర్చకు వచ్చింది. ఇలా ఉండగా నియోజకవర్గంలో మరో 125 కోట్ల రూపాయల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రోడ్డు డబ్లింగ్ పనులు జాప్యం చేస్తున్నారు. దేవనూర్ నుంచి యాలాల శివారు వరకు, అగ్గనూరు నుంచి ఏన్కేపల్లి వరకు బీటీ నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం తాండూరు చుట్టూ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లలో ఇద్దరు మరీ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. కందనెల్లి నుంచి మన్‌సాన్‌పల్లి వరకు వికారా బాద్ - తాండూరు హైవే పనులు కూడా ఇంకా పూర్తి చేయకపోవడంపై చర్చ జరిగింది. ఈ పనులను రాను న్న రెండు నెలల్లో పూర్తి చేసేలా అధికారులను ఆదేశిస్తా మని ఎమ్మెల్యే స్పష్టం చేసినట్లు సమాచారం. పంచాయత్‌రాజ్‌లో ఆన్‌గోయింగ్ వర్క్స్, ఆరంభం కాని పనుల గురించి ఆరా తీశారు. పనుల ఆధునీకరణ, బషీరాబాద్ మండలంలో డీఎంఎ ఫ్టీ పనులు, సీఆర్‌ఆర్‌లో మూడేసి చొప్పున పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇరిగేషన్ విభాగం పరిధిలో పెండింగ్‌లోని శివసాగర్ ప్రాజెక్టుపై అధికారులతో చర్చించారు. జుంటుపల్లి, కోటపల్లి ప్రాజెక్టుల ఆధునీకరణ, తూములు, కాల్వల నిర్మాణంపై సమీక్షించారు.

వీటికి ప్రతిపాదనలు తీసు కువెస్తే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ప్రజలు మెచ్చిన విధంగా పని చేయడమే అధికారులు లక్ష్యంగా పెట్టుకోవాలని స్పష్టం చేశారు. మైనింగ్ ఏడీ జాకోబ్ తదితర అధికారులు సమీక్షలో పాల్గొన్నారు ఇలా ఉండగా ప్రతి రెండు నెలలకు ఒక సారి వివిధశా ఖల అధికారులతో సమీక్షలు నిర్వహి స్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తన అనుయాయులతో మాట్లాడినట్లు తెలిసింది. అయితే, ప్రజాప్రతినిధులు మాత్రమే రివ్యూలో పాల్గొంటే మంచిదని అంటున్నారు. ఎమ్మెల్యే పక్కన కొంతమంది నేతలు కూర్చునేందుకు ఆరాటపడటం వల్ల సమీక్షలు సఫలం కావడం కష్టమని పలువురు వ్యాఖ్యానించారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా అధికారి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డిఆర్‌డివో కృష్ణన్

**దోమ, డిసెంబర్ 12 ప్రభాతవార్త** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైస్ మిల్లర్లకు పంపించాలని వికారాబాద్ జిల్లా గ్రామీణ అబివృద్ధి జిల్లా అదికారి కృష్ణన్ తెలిపారు. మంగళవారం నాడు దోమ మండల పరిదిలోని పాలెపల్లి గ్రామములో మండల మహిళాసమాఖ్య ఆద్వర్యములో వరి దాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహించగా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్బంగ ఆయన మాట్లాడుతూ గ్రామములో ఏర్పాటు చేసిన దాన్యం కోనుగోలు కేంద్రాన్ని ఈ నెల 7 నుండి ప్రారంబించినట్లు తెలిపారు.ఈ కేంద్రానికి అన్ని గ్రామాల ప్రజలు వరి దాన్యంను తీసుకువచ్చి అమ్ముకోవచ్చని అన్నారు. దాన్యంకు తేమ శాతం 11 నుండి 15 శాతం ఉండాలని ఈవిషయం రైతులు గమనించుకోని దాన్యంను తీసుకురావాలని తెలిపారు. వోపిఎంఎస్ ను ఎప్పటికప్పుడు చేసి దాన్యంకు సంబందించిన డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవిదంగా చూడాలని సిబ్బందికి సూచించారు. వరి కోనుగోలుకు సంబందించిన రికార్డులు సక్రమంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.ఇప్పటివరకు ఎన్ని బస్తాలు కోనుగోలు కేంద్రానికి వచ్చాయని ఎపియం సురేశ్‌ను అడుగగా 2965 బస్తాలు కొనడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమములో వడ్ల కొనుగోలు కమిటి మెంబర్లు యాదమ్మ,అనిత,సంధ్యారాణి,సిసి సుజ్ఞాని,బుక్‌కీపర్ రఘు, తదితరులు పాల్గోన్నారు.

## గురుకులంలో ముగిసిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

### గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**మేడ్చల్, డిసెంబర్ 12. ప్రభాతవార్త :** క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన వారు ఉన్నతంగా ఎదిగేందుకు బాటలు వసుకోవాలని, ఓడిన వారు నిరుత్సహ పడకుండా ముందుకు సాగాలని తెలంగాణ సాంఘీన సంక్షేమ గురుకుల సంస్థ జాయింట్ సెక్రటరీ అనంత లక్ష్మి, రాష్ట్ర క్రీడాధికారి రామలక్ష్మణ్ అన్నారు. మేడ్చల్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాల తొమ్మిదో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 9వ తేదీన మొదలైన ఈ టోర్నమెంట్‌లో ఏడు జోన్‌ల 1050 మంది బాలికలు పాలు పంచుకోగా వారికి అథ్లెటిక్స్, ఖోఖో, క్యారమ్స్ పోటీలు జరిగాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమని, బవిష్యత్‌లో కూడ అన్ని రంగాల్లో రాణించి గురుకుల పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. గురుకుల విద్యార్థులు అభ్యున్నతికి తమ వంత సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘీన సంక్షేమ గురుకుల సంస్థ హైదరాబాద్, రంగారెడ్డి తూర్పు విభాగ ఆర్‌సీఓ నాగకళ్యాణి, డిసిఓ సుధాకర్, మేడ్చల్ ఎంపిపి రజితా రాజమల్లారెడ్డి, జడ్పిటిసి శైలజా విజయనందరెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ గణేష్, కళాశాల ప్రిన్సిపల్ శైలజ, జగద్గిరిగుట్ట, శామీర్‌పేట, మల్కాజ్‌గిరి, అల్వాల్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు లక్ష్మి, మల్లారెడ్డి, మధులత, ధనలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న అతిథులు

# జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండా తగు చర్యలు

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 12, ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగ ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండ తగు చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన అన్నారు. తహసీల్దార్లు తమ విధులను సజావుగ నిర్వహించాలని ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండ ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఆర్డీవోలు, జిల్లాలోని వివిధ మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఇతరుల స్వాధీనంలో ఉంటే వారికి వెంటనే నోటీసులు జారీ చేసి వాటిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల వివరాలు తెలుసుకుని వాటిని ఎవరైనా కబ్జాలు చేసినట్లు ఉంటే వెంటనే పోలీసు బలగాలతో సంబంధిత ప్రదేశంలో ప్రభుత్వ భూమి అని సూచించేలా బోర్డుతో పాటు కంచెను ఏర్పాటు చేయాలని కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. ఈ విషయంలో ఎంతో జాగ్రత్తగ వ్యవరించాలని ఇబ్బందులు తలెత్తకుండ ముందస్తుగా కబ్జాలో ఉన్న వారికి సమాచారం అందించటంతో పాటు పోలీసు బలగాలతో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కబ్జాలు చేసిన వారు ఇబ్బందులకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకావాలని కలెక్టర్ వారికి సూచించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగ రెవెన్యూ అధికారులతో ప్రతి 15రోజుల కోసారి అన్ని విషయాలపై సమావేశాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు అధికారులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకరాగ ఆయన సానుకూలంగ స్పందించి వారి ఇబ్బందులు,సమస్యలను పరిష్కరించే దిశగ చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ విషయంలో అధికారులకు అండగ ఉంటానని భరోసా ఇచ్చారు. విదులు సక్రమంగ నిర్వహిస్తూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండ చూడాలని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వారితో పాటు ఆర్డీఓలు రాజేశ్‌కుమార్, శ్యామ్‌ప్రకాశ్, జిల్లాలోని తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, అధికారులు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కీసర, డిసెంబరు12, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.సిఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి జిల్లా రామన్న పేట గ్రామానికి చెందిన బొడ్డు అజయ్ (21) నగరంలోని యూసఫ్‌గూడలో ఫోటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. హన్నకొండలో ఉన్న ఒక పెండ్లి వివాహం,రిసెప్షన్‌కి తన స్నేహితులు అర్జున్,కిరణ్, క్రిష్ణ,పృధ్వి, చరణ్‌లతో కలిసి టిఎస్ 26 హెచ్ 3777 అనే కారులో వెళ్లారు,అక్కడ పెండ్లి,రిసెప్షన్‌లో ఫోటోలు తీసుకుని తిరిగి యాప్రా ల్‌కి వస్తుండగా మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్దకు రాగానే అజయ్ తన అజాగ్రత్తగా,నిర్లక్ష్యంగా కారు నడపడంతో కారు అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టాడు. కారులోని డాష్ బోర్డును ఢీ కొట్టడంతో అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తన స్నేహితులకు గాయలు అవ్వగా క్షతగ్రాతులను నగరంలోని శ్రీకర ఆసుపత్రికి తరలించామని ఎస్ మధు తెలిపారు.ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంగలి ప్రసాద్

## మహాలక్ష్మీ పథకం మహిళలకు వరం

**ఆమనగల్లు, డిసెంబర్12, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళామణులందరికీ వరంలా మారిందని యువజన కాంగ్రెస్ నాయకులు ఎంగలి ప్రసాద్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం 6గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలో విలేకరులతో కాంగ్రెస్ పార్టీ నాయెకులు కుమార్‌గౌడ్, శేఖర్‌లతో కలిసి ఎంగలి ప్రసాద్ మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసమే కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఆరంభమైందని, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతిస్తున్నాడన్నారు. కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంతో పేద, మధ్య తరగతి వర్గాల మహిళలకు ఆర్థిక స్వాలంభనకు ప్రేరిపిస్తుందన్నారు. బస్సు ఛార్జీలు భారంగా భావిస్తున్న ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేతంగా మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. మహాలక్ష్మి పథకంతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అన్ని గ్యారంటీ స్కీం పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతాయని ఎంగలి ప్రసాద్ తెలిపారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డికి అభినందనలు



కసిరెడ్డికి పుష్పగుచ్చం అందజేస్తున్న ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది

**ఆమనగల్లు, డిసెంబర్12, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన కసిరెడ్డి నారాయణరెడ్డిని మంగళవారం ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది కలుసుకుని అభినందించారు. వైద్యాధికారి డాక్టర్ పరీక్షిత్ ఆధ్వర్యంలో నరేంద్ర, విస్తరణాధికారి తిరుపతిరెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది ఎమ్మెల్యే కసిరెడ్డిని కలుసుకుని పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా కసిరెడ్డి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నిషియన్ వేణు, శేఖర్ తదితరులు ఉన్నారు.

## పోచారం మున్సిపల్ కౌన్సిలర్ కాంగ్రెస్‌లో చేరిక



పోచారం మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్ వెంకటేశ్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ ఇంఛార్జీ మల్లురవి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన దృశ్యం

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 12, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్‌కు చెందిన 10 వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ మంగళవారం జిల్లా కాంగ్రెస్ ఇంఛార్జీ మల్లురవి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఇంఛార్జీ మల్లు రవి నివాసానికి వెళ్లి కౌన్సిలర్ వెంకటేశ్ గౌడ్ పార్టీ కప్పుకున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ వెంబడి మాజీ వార్డు సభ్యుడు యు. వెంకటేష్, నాయకులు శశిమోహన్, రాజేంద్ర నాయక్, సిహెచ్ ఓదెల్ చేరినట్లు తెలిపారు.

## మండల కేంద్రంలో తపాలా ఉద్యోగుల సమ్మె




సమ్మెలో పాల్గొన్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

**కడ్తాల్,డిసెంబరు 12 ప్రభాతవార్త:** కడ్తాల్ మండల కేంద్రంలో మంగళవారం గ్రామీణ తపాలా ఉద్యోగులు 8 గంటల పని అప్పగించి పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని, సీనియారిటీ ప్రాతిపదికన వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. 7వ వేతన సంఘం సూచించిన కమలేష్ కమిటి ప్రతి పాదనలను తక్షణమే అమలు చేయాలన్న డిమాండ్‌తో కడ్తాల్ మండల కేంద్రంలో గ్రామీణ తపాలాశాఖ ఉద్యోగులు రవిందర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, అశ్విని, యాదయ్య, యాదిలాల్, జంగయ్య, రజిత, రమేష్ తదితరులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు వైస్ ఎంపిపి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న జడ్పీటిసి దశరథ్‌నాయక్, వైస్ ఎంపిపి ఆనంద్

**కడ్తాల్,డిసెంబరు 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొంగ్రిగాని బోర్డు తండా గ్రామ పంచాయతీకి చెందిన పెద్దిరెడ్డి చెరువు తండా అయ్యప్ప స్వాములకు ఇరుముడి కార్యక్రమం ఖర్చుల నిమిత్తం కడ్తాల్ వైస్ ఎంపిపి ఆనంద్ రూ. 30 వేల ఆర్థిక సాయాన్ని గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటి జిల్లా సభ్యులు, కడ్తాల్ జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ చేతుల మీదుగా స్వాములకు అందించారు. ఈ సందర్భంగా జడ్పీటిసి మాట్లాడుతూ ప్రతిఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని సూచించారు. మాలల వేసుకోవడం అంటే దేవుడి పైన చింతన తప్ప వేరే ఆలోచన లేకుండా మండలం పాటు అంత:కరణ శుద్ధితో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సమితి కోఆర్డినేటర్ జోగు వీరయ్య, వార్డు సభ్యులు శ్రీనుసేవ్య, గణేష్, కిషన్, కోటియా రమేష్, మునేష్, శ్రీను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇగ్నైట్ ఫేస్ట్ హెచ్‌ఆర్‌ఆర్ వెస్ట్ రీజియన్‌లో చేవెళ్ల విద్యార్థినుల ప్రతిభ

**మొయినాబాద్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** విద్యార్థినులు చదువుతో పాటు ఆట పాటల్లోనూ రాణించాలని పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డా.శారద వెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. ఈ నెల 11న బంట్వారం గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన హెచ్‌ఆర్‌ఆర్ వెస్ట్ రీజియన్ రీజినల్ లెవెల్ ఇగ్నైట్ ఫేస్ట్‌లో చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబర్చారు. 8వ తరగతి విద్యార్థిని కె.మణిదీప్తి స్పెల్ బిలో ప్రథమ స్థానం, 6వ తరగతి విద్యార్థిని కె.సాహితి వకృత్వ పోటీ (తెలుగు)లో ప్రథమ స్థానం, 8వ తరగతి విద్యార్థిని ఎన్.అపర్ణ వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. 9వ తరగతి విద్యార్థిని కె.అనూష వకృత్వ పోటీ హిందీలో, ఆర్.హర్షిని (బిపిసి మొదటి సంవత్సరం) స్పెల్ బిలో ద్వితీయ స్థానంలో విజేతలు అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పోటీలలో పాల్గొనాలని తెలిపారు. ఇదే ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని సూచించారు. పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డా.శారద వెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయ, అధ్యాపక బృందం అందరు విజేతలైన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.




హెచ్‌ఆర్‌ఆర్ వెస్ట్ రీజియన్ రీజినల్ లెవెల్ ఇగ్నైట్ ఫేస్ట్‌లో అద్భుత ప్రతిభ కనబర్చిన చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు

## ప్రజావాణిలో భారీగా ఫిర్యాదులు

**ఆదిభట్ల డిసెంబరు12,ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కేంద్రంగా సోమవారం ప్రజల ఫీర్యాదు కొరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అన్యుహ స్పందనతో చాలా మంది ప్రజలు తమ ఫిర్యాదులను విన్నవించుకోవడానికి బారులు తీరారు.ఇందులో భాగంగా మొత్తం ప్రజల నుండి 138 ఫిర్యాదులను స్వీకరించినట్లు అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి తెలిపారు.ప్రజలు అందించిన ఫిర్యాదులను వివిధ శాఖల అధికారులకు తెలియజేసి వీలైనంత తొందరతో సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.ప్రజలు ప్రజావాణి నిర్వహించడం పట్ల తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

## నిషేధిత గంజాయి పట్టివేత

**ఆదిభట్ల డిసెంబరు12,ప్రభాతవార్త :** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత గంజాయి పట్టుబడింది.సోమవారం సాయంత్రం ఐదు గంటల 45 నిమిషాలకు బొంగులూరు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు.రావిరాల నుండి బెంగళూరు వైపు వస్తున్న ఇద్దరు అనుమానిత వ్యక్తులు పరిగెత్తడంతో వారిలో ఒకరిని పట్టుకొని విచారించగా తన వద్ద ఉన్న బ్లూ కవర్లో 200గ్రాముల గంజాయి లభించింది. వివరాలు సేకరించగా ఆదిభట్ల శ్రీశ్రీ ఏరో సిటీ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న అఘతోష్ (21) అని తెలిసింది.మరో వ్యకినత పారిపోగా అతని సెల్‌ఫోన్ రోడ్డుపై పడడంతో దానిని స్వాధీనం చేసుకున్నారు.అనంతరం వారి దగ్గర సేకరించిన 200గ్రాముల గంజాయి మరియు సెల్‌ఫోన్ రెండు సీజ్ చేశామని ఆదిభట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి.కృష్ణయ్య తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కీసరగుట్టలో ముగిసిన కార్తీకమాసోత్సవాలు

**కీసర,డిసెంబరు12,ప్రభాతవార్త:** తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకసోత్సవాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో భాగంగా మంగళవారం తైలాభిషేకం పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నపూజతో కార్తీక మాసోత్సవాలు ముగిసాయి.మంగళవారం అమావాస్య, కార్తీక మాసంలో చివరి రోజు కావడంతో భక్తులతో పోటెత్తిపోయారు.స్వామి వారిని దర్శించుకునేందుకు నగరం నలు మూలల నుండి తరలి వచ్చిన భక్తులతో కేసరిగిరి ప్రాంతాలు కిటకిటలాడాయి.భక్తులు గర్భాలయంలో స్వామి వారికి అభిషేకాలు చేసుకున్నారు.కీసరగుట్ట ప్రాంతం ఎటు చూసినా భక్తుల శివలింగ అభిషేకాలు, కార్తీక దీపారాధనలతో నిండిపోయింది.మంగళవారం ఒక్క రోజే వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా.క్యూలైన్ల ప్రవేశాల వద్ద తెల్లవారు ఝాము నుంచి భక్తుల రద్దీ కనిపించింది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ,ఈఓ నరేందర్ అన్ని ఏర్పాట్లు చేశారు.

## వంద శాతం పన్నులు వసూలు చేయాలి



నాగారం మున్సిపాలిటీలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

**కీసర,డిసెంబరు12,ప్రభాతవార్త:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో 2023=24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులపై బిల్ కలెక్టర్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలోని కాలనీలలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు.ప్రతి వార్డులో శానిటేషన్‌కి సంబంధించి జరుగుతున్న పనులపై ఆడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజేంద్రకుమార్,మేనేజర్ చంద్రశేఖర్,శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి,బిల్ కలెక్టర్‌లు,శానిటరీ సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తాం



కీసరలోని అయ్యప్ప దేవాలయానికి విరాళం అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ రాయిల శ్రావణ్‌గుప్తా,రాయిల భాస్కర్ గుప్తా,రాయిల పవన్ గుప్తా

**కీసర,డిసెంబరు12,ప్రభాతవార్త:** దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని కీసర గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ రాయిల శ్రావణ్‌కుమార్ గుప్తా అన్నారు.మంగళవారం తన తండ్రి కీ.శే రాయిల క్రిష్ణమూర్తి జ్ఞాపకార్థం కీసరలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప దేవాలయానికి 2 లక్షల 1 వెయ్యి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని గురుస్వామి నల్ల బాల్‌రెడ్డి దీవించారు.ఈ కార్యక్రమంలో రాయిల భాస్కర్‌గుప్తా,రాయిల పవన్ గుప్తా,ఉపసర్పంచ్ లక్ష్మణ్‌శర్మ,గురుస్వామి బొడుసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల దినోత్సవంలో అందరూ పాల్గొనాలి

**దోమ, డిసెంబర్ 12 ప్రభాతవార్త** దేశరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీర జవానులకు,వారి ఆత్మశాంతింపజేయుటకు ప్రతి ఒక్కరు మందుకు రావాలని దోమ మండలము రాకొండ గ్రామానికి చెందిన మాజి సైనిక ఉద్యోగి గురునాథ్‌రెడ్డి తెలిపారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ 2001 సంవత్సరములో డిసెంబర్ 13న భారతదేశ రాజదాని ఢిల్లీ పార్లమెంటుపై ఉగ్రవాదులు దాడి చేయడం జరిగిందని అన్నారు.అట్టి దాడిలో ఉగ్రవాదులను దీటుగా ఎదుర్కొన్న కమలేశ్ కుమారి తో పాటు సిఆర్‌పిఎఫ్,ఢిల్లీ పోలిసులు మెత్తం 9 మంది వీరమరణం పొందారని తెలిపారు.ఈ విషయంపై 13.12.2023 బుదవారం నాడు పర్గిలోని కోడంగల్ చౌరస్తా మెన్ రోడ్డు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలీ అమరులకు నివాళులు అర్పించే కార్యక్రమము జరుపుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి అన్ని మండలాలప్రజా ప్రతినిదులు, యువకులు,ఉద్యోగ సంఘాల నాయకులు,ప్రజలు అందరు పాల్గొనాలని కోరారు.

## అయ్యప్ప మహా పడిపూజకు హాజరుకావాలి



బుయ్యని మనోహర్‌రెడ్డిని కలిసిన కుల్కచర్ల అయ్యప్ప స్వాములుల

**కుల్కచర్ల, డిసెంబర్,12;ప్రభాతవార్త;** త్వరలో నిర్వహించబోయే అయ్యప్ప మమ పడిపూజకు ప్రత్యేక ఆహ్వానితులుగా హజరు కావాలని తాండూరు శాసన సబ్యుడు బుయ్యని మనోహర్‌రెడ్డి హజరు కావాలని అయ్యప్ప సేవా సమితి గురు స్వాములు కోరారు.మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బుయ్యని మనోహర్‌రెడ్డి అయ్యప్ప సన్నిదానానికి విశిష్ట సేవలంది ంచారని దైవకార్యంలో అందరూ సమానులే నని వారు తెలిపారు.అకుంటిత దీక్షాపరులైన అయ్యప్ప స్వాములకు ఆయన చేసిన సేవలు మరువలేమని తెలిపారు.అనంతరం ఆయనకు శాసనస బ్యులుగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు సుంకరి సతీష్, ఈశ్వరయ్య, పట్లోళ్ల వెంకట్‌రాంరెడ్డి, స్వాములు శివకుమార్,గున్నె గణేష్,చెవిటి వినీత్ మరియు కన్నె స్వాములు పాల్గొన్నారు.

## చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం సాదించాలి

### బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రష్మిత



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

**కుల్కచర్ల;డిసెంబర్12;ప్రభాతవార్త;** విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో నైపుణ్యం సాదించాలని మహత్మ జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రష్మిత తెలిపారు.మంగళవారం వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గ శివారు ఎమ్‌జేపి గురుకుల పాఠశాల విద్యార్థి కె.అభినవ్ ఆత్మరక్షణ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచినందుకు గాను పాఠశాల సిబ్బంది అతనిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకుని ఎప్పుడు ఏ ఆపద వచ్చినా ఎదుర్కొనుటకు సిద్దంగా ఉండాలని తెలిపారు.ఈ నెల 10వ తేదీన షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సౌత్ ఇండియా కుంగ్ ఫూ,కరాటే చాంపియన్‌షిప్ 2023 పోటీల్లో అత్యుత్తమ ప్రతిబ కనబరిచి మొదటి స్థానంలోఓవరాల్ చాంపియన్‌గా నిలిచాడని అతనికి అభినందనలు తెలియజేశారు.శారీరక విద్యల ద్వార మానసికంగా కూడా ఆరోగ్యాన్ని దృఢత్వాని సాదించుకోవాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో కె.శ్రీకాంత్,పాఠశాల ఉపాధ్యయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** తడి, పొడిచెత్త సేకరణలో కార్మికులు తగిన అవగాహన కల్గిఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, కమీషనర్ ఎండి.సాబేర్‌అలీ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలోని డ్వాక్రాభవనంలో వెల్‌బీయింగ్‌ఔట్‌ఆఫ్ వేస్ట్ (డబ్ల్యుఓడబ్ల్యు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛసర్వేక్షన్ కార్యక్రమంలో చైర్‌పర్సన్ పావనియాదవ్, కమీషనర్ సాబేర్‌అలీలు మాట్లాడారు. తడి, పొడి చెత్త, హానికరమైన చెత్త వేరు చేసే పనిలో ఉంటున్న ఆటోడ్రైవర్లు, జవాన్లు, ఆర్‌పీలు డోర్‌టు డోర్ ఆటోలకు వేరు చేసి అందించడంపై అవగాహన కల్పించారు. ఘన వ్యర్థాల నిర్వహణలో సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ శుభ్రత, వ్యర్థాల శుద్దీకరణ, తడి, పొడిచెత్త వినియోగంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి, ఆర్‌పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వాలీంటర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక అక్రమార్కులకు చెక్ .!

**పకడ్బంధీగా వాల్టా చట్టం అమలు**
**ప్రభుత్వం ద్వారా రూ.600కే ట్రాక్టర్ ఇసుక**
**అనుమతుల కోసం తహాసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు : ఆర్డీఓ**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

**తాండూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమార్కులకు చెక్ పెట్టనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల జడ్పిటీసీలు, తహాసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఎస్సైలతో వాల్టా చట్టం అమలుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డిఎస్పీ శేఖర్‌గౌడ్, మైన్స్ ఏడీ జాకోబ్ తదితరులు వాల్టా చట్టం అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ద్వార రూ. 600లకే ట్రాక్టర్ ఇసును విక్రయించేందకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఇసుక అనుమ తుల కోసం ఆయా తహాసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని యాలాల మండల పరిధిలో బెన్నూరు వద్ద ఇసుక రీచ్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అక్కడి నుండే ఇసుక రవాణా చేయడం జరుగుతుందన్నారు. అనుమతులు పొందిన వారు ప్రభుత్వ పనిదినాలలో ఉదయం 6గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు తరలించేందకు అనుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంటి నిర్మాణ దారులకు మాత్రమే ఈ అవకాశం ఉంద న్నారు. వాల్టా చట్టం నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరిం చారు. నిబంధనలకు విరుద్దంగా ఇసుక అక్రమంగా తరలిస్తు పట్టుబడ్డ వాహానాలకు మొదటి సారి ట్రాక్టర్‌కు రూ.5వేల, పది టన్నుల లారీ రూ.25వేలు, అంతకంటే ఎక్కువ భారీ వాహానాలకు రూ.50వేల జరిమానా.. రెండో సారీ పట్టు బడితే రూ.15వేల నుండి రూ.1లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. మూడో సారీ పటుట్బడితే వాహానాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగు తుందని అన్నారు. అధికారుల పర్యవేక్షణలో ఇసుక రవాణా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంబాబు, జెడ్పిటీసీలు ధారాసింగ్, శ్రీనివాస్‌రెడ్డి, తహాసీల్దార్‌లు, ఎంపీడీఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొర్రెములకు ఆర్టీసీ బస్సులు నడుపాలి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** కొర్రెముల గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడుపాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డికి మాజీ సర్పంచ్ నాగరాజు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి రోడ్డు నిర్మాణనేపంతో గ్రామానికి రావాల్సిన ఆర్టీసీ బస్సులు నడపటం లేదని తెలిపారు. బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో వృద్ధులు, పిల్లలు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామానికి నిత్యం నడిపే బస్సులే కాకుండా అదనంగా ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ నాగరాజుతో పాటు మండల బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గ్యార రవి, గ్రామశాఖ అధ్యక్షుడు కుర్రీ ఆనంద్, ప్రధాన కార్యదర్శి పి. రాములు తదితరులున్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి డిసెంబరు12,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన తిక్కల కిష్టమ్మ తెల్లవారు జామున ఆకస్మాత్తుగా మరణించారు.ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 3వేల రూపాయలను అందజేశారు.అదే విధంగా రాంపూర్ గ్రామానికి చెందిన మాజీ హనుమాన్ దేవాలయ చైర్మన్ ముక్తాల నరసింహులు గౌడ్ 2వేల రూపాయలను అందజేశారు.మాజీ ఎంపిటిసి తిక్కల వెంకటయ్య,మాజీ సర్పంచ్ రాములు,కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్న హరి మోహన్ రెడ్డి,తిక్కల రమేష్,తిక్కల హరీష్,తదితరులు పాల్గొన్నారు.

## దేవునిపడకల్ నర్సరీలో మొక్కలు ఏర్పాటు

**తలకొండపల్లి డిసెంబరు12,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామంలోని నర్సరీలో సోమవారం 2024 సంవత్సరానికి సరిపడే మొక్కలు నాటేందుకు నర్సరీ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాడెమోని శ్రీశైలం ,ఉప సర్పంచ్ ,రాజమోని తిరుపతి,వార్డు సభ్యులు నర్సింహా, పంచాయతీ సెక్రటరీ జంగయ్య,సిబ్బంది,గ్రామస్థులు,పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ రామన్నకు మాతృ వియోగం

### పరామర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాజీ సర్పంచ్ రాంరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ డిసెంబరు12,ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ నేత వంకాయల రాం రెడ్డి తల్లి కౌసల్యా దేవి (75) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు.సమాచారం తెలిసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి,మాజీ జడ్పిటిసి సభ్యుడు మామిడి శ్యాంసుందర్ రెడ్డి,షాద్‌నగర్ సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్రీనివాస్ నాయక్,జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్ ,కేశంపేట ఎంపిపి ఎలగనమోని రవీందర్ యాదవ్,కాంగ్రెస్ సీనియర్ నేత మామిడి జనార్ధన్ రెడ్డి,పారిశ్రామికవేత్త పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి,పలువురు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామి కవేత్తలు, వ్యాపారవేత్తలు హాజరై నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.పరామర్శించిన వారిలో అడ్వకేట్ విక్రమ్ శర్మ,ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, నాయకులు కేశమోని వెంకటయ్య యాదవ్,మాజీ ఎంపిటిసి దామోదర్‌రెడ్డి,ఎర్ర అంజయ్య గౌడ్ ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు,కుందారం వెంకటరెడ్డి,బొమ్మగల నరసింహ, పసుల బుచ్చయ్య,మేకగూడ విగ్నేష్ రెడ్డి,పాండు, సుమన్, ఏకుల అంజయ్య,మోహన్ రెడ్డి,సుధాకర్ రెడ్డి ఉన్నారు.

## చెదరని స్నేహం.. ఒకటైన వేళ

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసిన పూర్వవిద్యార్థులు



షాద్‌నగర్ ఎమ్మెల్యేను సన్మానించిన 1986లో పదవ తరగతి పూర్వ విద్యార్థులు

**నందిగామ డిసెంబరు12,ప్రభాతవార్త :** నందిగామ మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986 బ్యాచ్ పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం చిన్ననాటి మిత్రుడు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి పూలబోకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.తమతో చదువుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిన్ననాటి జ్ఞాపకాలను వారు నెమరేసుకున్నారు.ఎన్నో ఎళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి మిత్రులు అంతా ఒకే చోటికి రావడంతో కొంతమంది కాస్త భావోద్వేగానికి గురయ్యారు.చిన్ననాటి మిత్రుడు వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ ఎమ్మెల్యేగా కావడం గర్వకారణం అన్నారు. ఈ వేడుకల్లో పూర్వవిద్యార్థులు సట్టి వెంకట్ రెడ్డి, విట్టల్, దార యాదయ్య,అబ్ధుల్ గని,మల్లారెడ్డి,వినయ్ కుమార్ గుప్తా, లింగారెడ్డి,సి.రమేష్ శర్మ,గడ్డమీద యాదయ్య,భాస్కర చారీ, షణ్ముఖ చారి,జంగయ్య గౌడ్,షేక్ కలీం పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల విద్యార్థినుల విజయం

**మొయినాబాద్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** ఈ నెల 9 నుంచి 12 వరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 9వ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ పోటీల్లో పాల్గొన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల చేవెళ్ల విద్యార్థినులు విజయ దుంధుభి మోగించారు. అండర్ 14 కేటగిరి అథ్లెటిక్స్ క్రీడలో 7వ తరగతి విద్యార్థిని ఎస్ వైష్ణవి 100, 200, 400 మీటర్లలో ప్రథమ స్థానంలో నిలవగా, 600 మీటర్ల విభాగంలో రెండవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయిలో వ్యక్తిగత ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. అలాగే అండర్ 17 కేటగిరిలో 9వ తరగతి విద్యార్థిని పి.శ్రుతి 4 ఇన్‌టు 100 రిలేలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డా.శారదవెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయ, అధ్యాపక బృందం అందరు విజేతలైన విద్యార్థులు అందరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



9వ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో విజయ దుంధుభి మోగించిన చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల కళాశాల విద్యార్థినులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

## రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**కోడంగల్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల ఉద్యోగులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విఆర్‌ఏలు, జూనియర్ అసిస్టెంట్, ఓఎస్‌లుగా ప్రమోషన్‌లు పొంది విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గత ఐదు నెలలు గడుస్తున్నా ట్రెజరీల నుండి ఉద్యోగ ఐడీలు, జీతాలు అంతడం లేదని ఆయా శాఖల ఉద్యోగులు మంగళవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఐదు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గత సవత్సరం సమ్మె కాలంలో 3నెలల జీతాలు కోల్పోయామని, ప్రస్తుతం 5నెలలుగా జీతాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వారు తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పూర్తి స్థాయిలో విధులు నిర్వహించామని తెలిపారు. రాత్రి పగలు ప్రభుత్వానికి సహకరించినట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక కొందరు ప్రాణాలు సమితం కోల్పోయారని అన్నారు. వెంటనే అధికారులు చొరవ తీసుకొని ఉద్యోగులకు ఐడీలతో పాటు వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రామీణ తపాల ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

**కోడంగల్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** గ్రామీణ తపాలా ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మంగళవారం కోడంగల్ తపాలా కేంద్రంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు విధులు బహిస్కరించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం ద్వార అందిచనున్న ఆసరా పంపిణీ, పోస్టల్ లావాదేవీలు, ఉత్తరాల బట్వాడా ఆగిపోయింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా ఉద్యోగులకు 4గంటలు మాత్రమే పని కల్పిస్తూ రూ.10వేల నుండి రూ. 12,500 బేసిక్ వేతనాలు అందిస్తున్నారని తెలిపారు. వంటే ఉద్యోగులకు 8గంటలు పని విధానం కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రణాలికాబద్ధంగా పాఠ్యాంశాలను బోధించాలి

### మండల విద్యాధికారి హరిశ్చందర్


సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి హరిశ్చందర్

**పూడూరు, డిసెంబర్ 12, ప్రభాతవార్త :** ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలను బోధించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మన్నెగూడ,చెన్‌గోముల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. అనంతరం పాఠశాల కాంప్లెక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతిగదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి ప్రతిఒక్క విద్యార్థిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పిరియడ్ ప్లాన్, లైబ్రరీ, టిఎల్ఎం, అంశాలపై చర్చించి, తదుపరి టిఎల్ఎంపై అవగాహన కల్పించారు. కాంప్లెక్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, హెచ్ఎంలు రత్న, స్వరూప, పలువురు ఉపాధ్యాయులు, సిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## నాగారంను అభివృద్ధి చేయడమే లక్ష్యం


నాగారం మున్సిపాలిటీ 7వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

**కీసర, డిసెంబరు12, ప్రభాతవార్త:** నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిదిలోని 7వ వార్డులోని సాయి నివాస్ కాలనీలో మున్సిపల్ నిధులు 10 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో కౌన్సిలర్‌ల సహకాంతో అభివృద్ది పనులు చేయడం జరుగుతుందన్నారు. దశల వారిగా మున్సిపల్‌లోని అన్ని వార్డులలో అభివృద్ది పనుకలు శంకుస్థాపన చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ గూడూరు సబిత అంజనేయులు గౌడ్, కాలనీవాసులు జావిద్, మహేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశాల్లో విద్యను అభ్యసించడానికి చక్కటి అవకాశాలు

**నర్సాపూర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** విదేశాలలో విద్యను అభ్యసించ డానికి చక్కటి అవకాశాలు, ప్రోత్సహకాలు లబిస్తాయని బింగ్ హామ్‌టన్ యూనివర్సిటి న్యూయార్క్ డీన్, ప్రొఫెసర్ కిన్నెబోయిన నాగరాజు అన్నారు. మంగళవారం నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మసీ, బీవీఆర్ఐటి కళాశా లను ఆయన సందర్శించారు. ఈ సందర్బంగా ఆయన బివిఆర్ఐటి కళా శాలలోని ఏటిఎల్ ల్యాబ్‌ను, త్రీడి ప్రింటింగ్, వికలాంగులకు ప్రత్యేకంగా రూపొందించిన పరికరాల గురించి కళాశాల ప్రతినిధులు వివరించడం జరి గింది. ఈ సందర్బంగా నాగరాజు మాట్లాడుతూ విదేశాలలో విద్యను అభ్య సించడానికి కావాల్సిన మంచి ప్రోత్సహాకాలు ఉన్నాయన్నారు. విదేశాలలో కలిగే ప్రోత్సకాలను, విధివిధానాలను విద్యార్థులకు వివరించడం జరిగింది. అదేవిధంగా అధ్యాపకలకు ఉన్నతవిద్యను అభ్యసించడానికిగల అవకాశాలను వివరిస్తూ తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అంతేగాక బింగ్ హామ్‌టన్ యూనివర్సిటిలో ఎంఓయు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణు విద్యా సంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమార్కులకు చెక్ .!

**పకడ్బంధీగా వాల్టా చట్టం అమలు**
**ప్రభుత్వం ద్వారా రూ.600కే ట్రాక్టర్ ఇసుక**
**అనుమతుల కోసం తహసీల్దార్**
**కార్యాలయంలో దరఖాస్తులు : ఆర్డీఓ**


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

**తాండూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమార్కులకు చెక్ పెట్టనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండ లాల జడ్పిటీసీలు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఎస్సై లతో వాల్టా చట్టం అమలుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డిఎస్పీ శేఖర్‌గౌడ్, మైన్స్ ఏడీ జాకోబ్ తదితరులు వాల్టా చట్టం అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ద్వార రూ. 600లకే ట్రాక్టర్ ఇసును విక్రయించేందకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఇసుక అనుమ తుల కోసం ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని యాలాల మండల పరిధిలో బెన్నూరు వద్ద ఇసుక రీచ్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అక్కడి నుండే ఇసుక రవాణా చేయడం జరుగుతుందన్నారు. అనుమతులు పొందిన వారు ప్రభుత్వ పనిదినాలలో ఉదయం 6గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు తరలించేందకు అనుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంటి నిర్మాణ దారులకు మాత్రమే ఈ అవకాశం ఉంద న్నారు. వాల్టా చట్టం నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్దంగా ఇసుక అక్రమంగా తరలిస్తు పట్టుబడ్డ వాహానాలకు మొదటి సారి ట్రాక్టర్‌కు రూ.5వేల, పది టన్నుల లారీ రూ.25వేలు, అం తకంటే ఎక్కువ భారీ వాహానాలకు రూ.50వేల జరిమా నా.. రెండో సారీ పట్టు బడితే రూ.15వేల నుండి రూ.1లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. మూడో సారీ పటుట్బడితే వాహానాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగు తుందని అన్నారు. అధికారుల పర్యవేక్షణలో ఇసుక రవాణా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంబాబు, జెడ్పిటీసీలు ధారాసింగ్, శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మ్యాన్ హోల్ పైకప్పును ఏర్పాటు చేయండి

**నర్సాపూర్, డిసెంబర్ 12.ప్రభాతవార్త :** నర్సాపూర్ పట్టణంలోని 9 వ వార్డు విఘ్నేశ్వర కాలనిలో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారినందున ఈ మ్యాన్ హోల్ పై కప్పును ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. గత సంవత్సరం నుండి ఈ మ్యాన్ హోల్ పై కప్పు లేక పోవడంతో ప్రమాదకరంగా మారిందని ఇటు వైపు వెళ్లాలంటేనే కాలనీ వాసులు జంకుతున్నారు. ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఈ మ్యాన్ హోల్ తో చాల ప్రమాదం పొంచి ఉందంటున్నారు. ఈ మేరకు మున్సిఫల్ అధికారులు స్పందించి ఈమ్యాన్ హోల్ పై కప్పును ఏర్పాటు చేసి ప్రమాదం నుండి కాపాడాలని కాలనీ వాసులు కోరారు.

## నా గెలుపు కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు అంకితం

**కొల్చారం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:**
అహోరాత్రులు కష్టపడి సైనికుల్లా పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు నా గెలుపును అంకితం చేస్తున్నానని బీఆర్ఎస్ పార్టీ నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. కొల్చా రంలోని ప్రసిద్ధ వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని పార్వతి పరమేశ్వరునికి, భద్రకాళి సమేత వీరభద్ర స్వామికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు వనమాల అనిల్‌కుమార్, ర్యాగళ్ల ఆనంద్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరభద్ర స్వామి ఆలయంలో వేడుకల్లో పాల్గొనడం అదృష్టంగాభావిస్తున్నానని ఆలయ నిర్వాహకులను అభినందించారు.

**ఆకాశదీపాన్ని చూడటం..**
**వెలిగించడం అదృష్టంగా భావిస్తున్నా...**
**కొల్చారం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:**
ఆకాశ దీపాన్ని చూడటం..వెలిగించడం అదృష్టం గా భావిస్తున్నామని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితా లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ మేఘమాల సంతోష్, సర్పంచి కరెంటు ఉమరాజాగౌడ్, ఎంపీటీసీ పాల్వంచ అరుణ కృష్ణాగౌడ్ అన్నారు. కొల్చారం గ్రామంలోని ప్రసిద్ధ వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం కనుల పండుగలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆలయంలో నిర్వహించే నక్షత్ర దీపో త్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని బిఆర్ఎస‌ పార్టీ పైతర గ్రామ యూత్ ఐకాన్ యాబన్నగారి రవితేజారెడ్డి గ్రామస్థు లతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాశ దీపాన్ని చూడటం, వెలిగించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాండ్ర వెంకటేశం, వడ్ల ప్రభాకర్, గ్యాస్ కృష్ణ, ముత్యంగారి సంతోష్ కుమార్, వనమాల అనిల్‌కుమార్, ఎల్లేశం, మురళీ, చంద్రశేఖర్‌రెడ్డి, రవితేజారెడ్డి, చిట్యాల యాదయ్య, కరెంట్ రాజాగౌడ్, శ్రీశైలం, ర్యాగళ్ల ఆనంద్, నాగురి మనోహర్, చిన్న రాములు, సార దుర్గయ్య, ముత్యం ప్రవీణ్ కుమార్, చౌరిగారి ఆంజనేయులు, నింగోళ్ల చెన్నయ్య, మ్యాదరి విఠల్, దుర్గాప్రసాద్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, వీరభద్ర ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం

**శామీర్‌పేట, డిసెంబరు 12, ప్రభాతవార్త** శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. తూంకుంట గ్రామానికి చెందిన మహేశ్, మాదవి, వారి కుటుంబ సభ్యులు ఓంకార్, గగన్ ప్రహన్‌లు అన్నదాతగ అన్నదానంను నిర్వహించారు. అదే విధంగ అల్వాల్ ప్రాంతానికి చెందిన అశోక్ శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారికి రవ్వస్వీటి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో అదే విధంగ అన్నదాన కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి పాల్గొన్నారు. శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల భక్తులు, రాజీవ్‌రహదారిన వెళ్తున్న భక్తులు పలువురు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద జరిగిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తుల దృశ్యం

## ముగిసిన కార్తీక పూజలు..అన్నదానం


అన్నదాతలను సనా ్మనిస్తున్న ఆలయ ధర్మకర్తలు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబమల్లికార్జునస్వామి దేవస్థానంలో గత నెల రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్న కార్తీకమాస పూజలు మంగళవారంతో ముగిసాయి. అమావాస్య సందర్భంగా ఆలయ ధర్మకర్తలు, భక్తులు ఉదయం నుంచే ఆలయంలో స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఓంనమః శివాయ అనే పంచాక్షరీ మంత్రంతో మల్లికార్జునస్వామికి అభిషేకం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. కార్తీకం చివరి రోజు ఆలయ ధర్మకర్తలు కంట్లం చెన్నప్ప, నరేశ్, ప్రదీప్, నవీన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, సాయిచంద్‌లు భక్తులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా అన్నదాతలను శాలువా, పూలదండలతో సనా ్మనించి కృతజ్ఞతలు తెలియజేశారు.

## 14న దివ్యాంగుల జిల్లా స్థాయి క్రీడోత్సవాలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న సిద్దిపేటలోని డిగ్రీకళాశాలలో దివ్యాంగుల జిల్లాస్థాయి క్రీడోత్సవాలు నిర్వహించటానికి తగు ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడోత్సవాలలో అంధ, బదిర, శారీరక, మానసిక దివ్యాంగులకు రన్నింగ్, షాట్‌పుట్, చెస్, జావలిన్ త్రో, క్యారంల లో జూనియర్ విభాగంలో 10 నుంచి 16 ఏళ్లు, సీనియర్ విభాగంలో 17 నుంచి 35ఏళ్ల కేటగిరీలలో క్రీడోత్సవాలు నిర్వహించనున్నారు. క్రీడోత్సవాల లో పాల్గొనే దివ్యాంగులు వయస్సు ధృవీకరణ, అధార్, సదరం వైకల్య పత్రాలతో 14న జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 9 గంటలకు హాజరై పేరు నమోదు చేసుకోవాలని జిల్లా సంక్షేమ, మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్దులశాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

**కొమురవెల్లి, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** మండలపరిధిలోని గురువన్న పేట గ్రామానికి చెందిన కూలీలు ప్రమాదంలో మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా అదుకునేలా చర్యలు తీసు కుంటానన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలకు అర్థిక సహాయం అందించారు.

## ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ఘన సన్మానం

**నారాయణఖేడ్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:**
నూతనంగా ఎన్నికైన నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డిని కాం గ్రెస్ అభిమానులు ఘనంగా సన్మానించారు. మంగళవారం నారాయణఖేడ్ లో ఎమ్మెల్యే నివాస గృహంలో కంగ్టి మండలంలోని రాజారామ్ తండా సర్పంచ్ పల్లవి పరశురాంరాథోడ్, ఖిరునాయక్ తండా వాసులు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ఘనంగా పూలమాలవేసి శాలువతో సన్మానించారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ పల్లవి పరశురాం మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రాంతం గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే నారాయణఖేడ్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముంగిలాల్, ఉప సర్పంచ్ గంగారాం, మాజీ ఎంపీటీసీ మనిరాం, విద్యా కమిటీ చైర్మన్ గోపాల్, గోవింద్‌నాయక్, విఠల్‌నాయక్, నందులాల, మనిరాంనాయక్, గులాబ్‌సింగ్, చందర్, లక్ష్మన్, రవీందర్ రేషన్ డీలర్, జీవన్, రాంకిషన్, బాబుసింగ్, సుభాష్‌నాయక్, దుంసింగ్, శంకర్ పాల్గొన్నారు.

## నేడు నర్సాపూర్‌లో కృతజ్ఞత సభ

**నర్సాపూర్, డిసెంబర్ 12.ప్రభాతవార్త :** నేడు(బుదవారం) నర్సాపూర్ లోని కంజర్లయాదవ్ పంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో కృతజ్ఞత సభ ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కృతజ్ఞత సభకు మాజీ మంత్రులు హరీష్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గాలి అనిల్‌కుమార్, సింగాయిపల్లి గోపి, ఇతర జిల్లా ముఖ్యనాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈమేరకు ఈ కృతజ్ఞత సభకు బిఆర్ఎస్ నాయకులు, కార్యక్తలు అదిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం టి.మాందాపూర్‌కు చెందిన కర్ణాకర్, ప్రభాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మైనంపల్లి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ రాజిరెడ్డి, నాయ్యవాది బాలయ్య, గంగానరేందర్, సురేందర్‌నాయక్‌లు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు బస్సుల సంఖ్యను పెంచాలని వినతి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, చందుపట్లగూడ ప్రజల సౌకర్యార్థం బస్సులు నడపాలని మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి మంగళవారం కుశాయిగూడ డిపోమేనేజర్ చంద్రకాంత్, చెంగిచర్ల డిపో సహాయ మేనేజర్ ఆనంద్‌లకు వినతి పత్రం పంపించారు. కరోనా నాటినుంచి ఆర్టీసీ అధికారులు బస్సులను రద్దు చేశారని ఇప్పటికి పునరుద్దరించకపోవడంతో ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈమేరకు కౌన్సిలర్ సంగీత రాసిన వినతిని మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి డిపో అధికారులకు అందజేశారు. ఎన్ఎఫ్‌సీనగర్‌కు రెండు షటిల్ బస్సులు, ఎన్ఎఫ్‌సీనగర్ నుంచి ఇసీఐఎల్ క్రాస్ రోడ్, ఉప్పల్ క్రాస్ రోడ్ వరకు నిరంతరంగా బస్సులు నడపాలని కోరారు. ఎదులాబాద్‌కు వెళ్లే బస్సులు వయా బొక్కోనిగూడ, చందుపట్లగూడ మీదుగా వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె పేరొ ్కన్నారు. వినతిపై కుశాయిగూడ, చెంగిచర్ల డిపో అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సక్రమంగా కల్పించేలా చూడాలని కోరారు. ఎన్ఎఫ్‌సీనగర్ మాజీ ఎంపిటిసి జంపాల రమేశ్, మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డిలు డిఎంల ను కలిసి వచ్చారు.

## మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటే : సిఐ

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** మనిషి మనుగడకు చదువు చాలా ముఖ్యమని..చదువు ఉంటే ఎక్కడైనా ఎలానైనా బతకొచ్చని టూ టౌన్ సీఐ రవికుమార్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మందపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు బాలికల, మహిళల రక్షణ చట్టాలు, యాంటీ హ్యుమన్ ట్రాఫికింగ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ నిర్మూలన, మానవ అక్రమ రవాణా, గుడ్‌టచ్, బాడ్‌టచ్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేసుకొని బంగారు భవిష్యత్‌ను నాశన ం చేసుకోవద్దన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణాలు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలకు గురికావొద్దన్నారు. బ్యాంకు అధికారులమంటూ ఎవరైన ఫోన్‌చేసి ఖాత వివరాలు అడిగితే చెపొద్దన్నారు. మహిళలు, యువతలు ఎలాంటి సమస్య ఉన్న షీటీమ్ నంబర్ 87126673443 ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు, షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కవ్వంపల్లి గెలుపుతో మొక్కు చెల్లించుకున్న యువకులు

**బెజ్జంకి, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** మానకొండూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందాలని మండలం లోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ముక్కిస రమణారెడ్డి అనే కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గన్నేరువరం మండలంలోని ఖాసీంపేట గ్రామంలో గల ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన మానసాదేవి అలయంలో 101 కొబ్బరికాయలు కొడతానని ముడుపులు వేయగా సత్యనారాయణ మెజార్టీతో గెలు పొందడంతో మంగళవారం మండల నాయకులతో కలిసి మానసాదేవిని దర్శించుకొని 101 కొబ్బరికాయలు కొట్టి తన మొక్కును చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గుండారం సర్పంచ్ చెట్టి లావణ్య, పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, రాజు, నర్సయ్య, హరీష్, తిరుపతి, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెయింటింగ్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా మహేష్

**కోహెడ, డిసెంబర్ 12, ప్రభాతవార్త :** పెయింటింగ్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా గడ్డం మహేష్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా గడ్డం మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తానన్నారు. తన నియా మకానికి సహకరించిన అసోసియేషన్ సభ్యులకు కృత జ్ఞ తలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహంకాళి అశోక్, ప్రధాన కార్యదర్శి పొన్నాల ప్రసాద్, కార్యదర్శి బక్కతట్ల సంబశివరాజ్, ప్రచార కార్య దర్శి కొడముంజ సుదర్శన్, కోశాధికారి నూదూనూరి సంపత్, గౌరవాధ్యక్షు లుగా పైడిపాలా బాలయ్య, సలహాదారులుగా వి.శ్రీనివాస్, ఏ.మహేందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
వంద నియోజకవర్గాలలో డిపాజిట్ కోల్పోయిన వాళ్లు సైతం నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని మెదక్ రోడ్డులో గల ఓ హోటల్‌లో మంగళవారం కార్యకర్తలతో కలిసి టీ తాగిన అనంతరం ఆయన మాట్లాడారు. బీజేపీ, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటే అని గతంలో చెప్పాం ఇప్పుడు అదే నిజం అవుతుందన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో నిజమని తేలిపోయిందన్నారు. కడియం శ్రీహరి, రాజాసింగ్ ఇద్దరి వ్యాఖ్యలు రెండు పార్టీలు ఒక్కటేనని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో మెజార్టీ స్థానాలను సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా ఏర్పడిన ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యాలు చేయడం మానుకోవాలన్నారు. ప్రజలకు మంచి పరిపాలన అందించి తిరిగి మళ్లి 5 ఏళ్ల తర్వాత అధికారంలోకి వచ్చి తీరుతామన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి, సిద్దిపేటఉన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఇవో

**కొల్చారం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** ఉన్నతి కార్యక్రమంలో భాగంగా తెలుగు భాషా ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సముదాయ సమావేశంలో భాగం గా రంగంపేట, కొల్చారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న కొల్చారం, మెదక్, హవేళిఘనపూర్ మండలాల తెలుగు, ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సముదాయ సమావేశానికి మండల విద్యాధికారి నీలకంఠం హాజరయ్యారు. కార్యక్రమం లో కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉపేందర్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, జిల్లా రిసోర్స్ పర్సన్ ఎన్.సత్యనారాయణ, సీఆర్‌పీ


మంత్రి నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఆర్‌బిఎస్ సమన్వయకర్త అంజిరెడ్డి

## మంత్రి నాగేశ్వరరావుకు అంజిరెడ్డి సన్మానం

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఘట్‌కేసర్ మండల రైతుబంధుసమితి సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి కలిశారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల నాగేశ్వరరావును అంజిరెడ్డితో పాటు కిసాన్ సంఘ్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్ప గుచ్చం అందజేశారు. ఈసందర్భంగా వ్యవసాయం, రైతుల పెట్టుబడిసాయం, వరి, ఉద్యానవన సాగుపై వారు మంత్రితో చర్చించారు. మేడ్చల్ జిల్లాలోని ఉద్యానవన పంటలను సందర్శించాలని వారు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా పంటలను చూస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కిసాన్‌సంఘ్ అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, సభ్యులు సురేందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రాజు, ఘట్‌కేసర్ సహకార సంఘం మాజీ డైరక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాస శివరాత్రి పూజలు

**శామీర్‌పేట, డిసెంబరు 12, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన శామీర్‌పేట గ్రామంలోని శ్రీభవాని రామలింగేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని సోమవారం రాత్రి ఘనంగ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు జి.మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీస్వామి వారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. తూంకుంటకు చెందిన హరిహర భజన మండలి వారి ఆధ్వ ర్యంలో భక్తి గీతాలు భజన కార్యక్రమాలు ఆలపించారు. భక్తులు కూడ పాల్గొని భక్తిగీతాలను ఆలపించటం, భజన కార్యక్రమాలతో ఆలయం అంత భక్తిపారవశ్యంగ మారింది. ఆ తరువాత భక్తులు శ్రీభవాని రామలిం గేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆ తరువాత అదే రాత్రి భక్తుల సహకారంతో అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరిం చారు. ఆలయ ప్రధాన అర్చకులు జి.మురళీధర్‌శర్మ హరిహర భజన మండలి వారిని సన్మానించి అభినందించారు.




శివాలయంలో పూజలు నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర్‌శర్మ, కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు